క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


అరట్లకట్టలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ సత్యవేణి

కరప: అరట్లకట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు గ్రామసర్పంచ్ గోపి సత్యవేణి యూనిఫామ్ దుస్తులు అందజేశారు. సంక్రాంతిని ఆనందంగా గడుపుకోవాలని సర్పంచ్ సత్యవేణి అన్నారు. గ్రామ కార్యదర్శి వై.రామ్‌జీ హీరాలాల్, వైఎస్సార్ సీపీ నాయకుడు గోపి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి సాహిత్య సేవలు ఆదర్శనీయం


అద్దేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ ప్రముఖులు

కాకినాడ కల్చరల్: ప్రజాకవి, నిత్యసాహితీ సంచారి దివంగత డాక్టర్ అద్దేపల్లి రామమోహన్ రావు సాహిత్య సేవలు ఆదర్శనీయమని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో అద్దేపల్లి వర్ధంతి సభ సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకీరామ్‌చౌదరి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. పలువురు వక్తలు అద్దేపల్లి సాహిత్య సేవలను కొనియాడారు. అద్దేపల్లితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. అద్దేపలి రచించిన 'కాలం మీద సంతకం' అనే కవితా సంపుటిలోని అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో గౌరినాయుడు, అద్దేపల్లి ప్రభు, రామస్వామి, ఇంద్రగంటి, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ డీజీపీ సునీల్‌కుమార్‌ను కలిసిన మండల నాయకులు

కరప: మండలం విజయరాయుడుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు శుక్రవారం అమరావతి వెళ్లి సీఐడీ శాఖ డీజీపీ పీవీ సునీల్ కుమార్‌ను కలిసి, అభినందనలు తెలిపారు. సీఐడీశాఖలో డీజీపీగా పనిచేస్తున్న సునీల్‌కుమార్‌కు పదోన్నతి లభించడంతో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్టు వైఎస్సార్ సీపీ విజయరాయుడుపాలెం గ్రామకమిటీ అధ్యక్షుడు కాదా వెంకటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ సతీష్, పచ్చిమాల నాగరాజులు తెలిపారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

బోట్‌క్లబ్: ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సాలిపేటలోని విశ్వేశ్వరస్వామిని దర్శించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం భక్తులు చేయించిన బంగారం కిరీటాన్ని ఆయన పరిశీలించారు. ఆలయానికి వచ్చిన డీసీకి ఆలయ మర్యాదలతో ఈఓ శివబాబు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విస్తృతంగా లయన్స్ సేవలు


లయన్స్ మూలనిధికి సహాయం చేసిన సభ్యులను సత్కరించిన దృశ్యం

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమయ్యాయయని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రామారావుపేట లయన్స్ హాల్లో ఆదివారం ఆ క్లబ్ అధ్యక్షుడు లయన్ మురళీకృష్ణ అధ్యక్షతన లయన్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్‌జోన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ పౌండేషన్ మూలనిధికి 13 వేల డాలర్లు(రూ.10లక్షల 80 వేలు) బాదం బాలకృష్ణ, కుసుమ దంపతులు, క్లబ్ సభ్యులు 32 మంది రూ.82వేలు అందజేశారు. ఆర్థిక సహకారం చేసిన క్లబ్ సభ్యులను సత్కరించారు.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్

సామర్లకోట: జిల్లాకు ముఖ్య జంక్షన్ సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రయాణికులతో శుక్రవారం కిటకిటలాడింది. సంక్రాంతి సందర్భంగా వివిధ పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారు గ్రామీణ ప్రాంతాల్లోని స్వగ్రామాలకు చేరుకొంటున్నారు. సికింద్రాబాద్, విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చేరుకోవడానికి సామర్లకోట జంక్షన్‌కు ప్రయాణికులు వెళతారు. సామర్లకోట నుంచి కాకినాడ, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి తదితర ప్రాంతాలకు తరలి వెళ్లారు.


కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న జ్యోతుల మార్కెట్


మెయిన్‌రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు


గాంధీనగర్ మార్కెట్ వద్ద విక్రయిస్తున్న భోగి పిడకలు

మార్కెట్‌కు పండగ శోభ

- కిటకిటలాడిన దుకాణాలు

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీ కాకినాడకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. పండగ వేళ.. నగరంలో కొత్త వస్త్రాల కొనుగోలుకు వచ్చిన వారితో నగరం కిటకిటలాడింది. ఏ వస్త్ర దుకాణం చూసినా జన రద్దీగా మారాయి. ఇక సంక్రాంతికి తమ సొంత ఊళ్లకు వెళ్లేందుకు పయనమవ్వడంతో కాకినాడ బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులుతో రద్దీగా మారాయి. శుక్రవారం ఉదయం సాధారణ రద్దీగా ఉన్న వస్త్ర, ఫ్యాన్సీ, చెప్పులు దుకాణాలు సాయంత్రానికి కిక్కిరిసిపోయాయి. దీంతో మెయిన్‌రోడ్డు, భానుగుడి సెంటర్, మసీద్‌సెంటర్, బాలాజీచెరువుసెంటర్, దేవాలయం వీధి, సినిమారోడ్డులోని వ్యాపార ప్రాంతాలన్ని రద్దీగా మారాయి. నగరంలో ఏ వీధి చూసినా వాహనాలు బారులుదీరాయి. దుకాణాలన్నీ కొనుగోలు దారులతో నిండిపోయాయి.

సామాన్యుల మార్కెట్‌గా పేరొందిన సంతచెరువు జన సంద్రాన్ని తలపించింది. మార్కెట్‌లోకి వెళ్లేందుకు దారి కూడా లేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు వచ్చిన పలువురు వాహనాలు రోడ్డు మధ్యలో పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. మెయిన్‌రోడ్డు, దేవాలయంవీధిలో ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రయాణికులు పడరానిపాట్లు పడ్డారు. బొబ్బట్లు, అరుసులు, సున్నుండలు ప్రత్యేక స్టాల్స్ పెట్టి విక్రయించారు. ఇక నగరంలో పలు మిఠాయి దుకాణాల వద్ద సంక్రాంతి తినుబండరాలు తయారు చేసి విక్రయించారు. నగర ప్రజలు వీటిని కొనుగోలు చేసుకోవడం కనిపించింది. మరికొందరు తమ బంధువులకు ఇచ్చేందుకు స్వీట్ల ప్యాకెట్లు సిద్ధం చేసుకుంటున్నారు.

భోగిపిడకలు విక్రయం

కాకినాడ నగరంలో భోగిపిడకలు ప్రతి సెంటర్‌లోనూ విక్రయించారు. దండ ఒక్కొక్కటి రూ.60 నుంచి 80 వరకూ విక్రయించారు. భోగిమంటలో పిడకలు వేసేందుకు ప్రజలు వీటిని కొనుగోలు చేశారు.

ప్రతి ఇంటా సంక్రాంతి ఆనందాలు నింపాలి

- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


వలసపాకల గ్రామంలో రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: రైతన్నలు పంట చేతికి వచ్చే తరుణంలో జరుపుకొనే పండగ సంక్రాంతి. పల్లెల్లో సందడి చేసే ఈ పండగ ప్రతి ఇంటా చిరు సంపదలు, ఆనందాలను నింపాలని కాకినాడ రూరల్ నియోజక వర్గ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆకాంక్షించారు. నియోజక వర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు వారి సంప్రదాయ పండగల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండగలు ప్రధానమైనవన్నారు.

వలసపాకలలో విజేతలకు బహుమతుల అందజేత

మండలంలోని వలసపాకల గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లుల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే కన్నబాబు బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బీ బీ, సీనియర్ నేత గోపుశెట్టి బాబ్జీ, బెజవాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ది గోదావరి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక శుభం కల్యాణ మండపంలో ది గోదావరి కళా కౌముది ఫౌండేషన్ అధ్యక్షుడు బాజిబోయిన వెంకటేష్‌నాయుడు ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆకర్షణీయమంగా ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బసవా ప్రభాకరరావు అరుణ, పుప్పాల సూర్యకుమారి, మణిబాల తదితరులు పాల్గొన్నారు.

హార్బర్‌పేటలో ఘనంగా..

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామ పంచాయతీ పరిధి ఫిషింగ్ హార్బర్‌కు ఆనుకుని ఉన్న హార్బర్ పేటలో మత్స్యకారులు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మోషే ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు, భోగి మంటలు, పలు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

స్థానిక స్వామినగర్ 42వ డివిజన్ సచివాలయం వద్ద సంక్రాంతి సంబరాలు 42వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కోరాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు మ్యూజికల్‌చైర్ పోటీలు, ఫ్యాషన్‌షో నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంప్రదాయ దుస్తులతో భోగిమంటలు వేసి సంక్రాంతి పండుగకు ఘనంగా స్వాగతం పలికారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు, మ్యూజికల్ చైర్ విజేతలకు, ఫ్యాషన్ షో విజేతలకు 42వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కోరాడ దుర్గాప్రసాద్, సచివాలయ అడ్మిన్ రాము, సెక్రటరీలు, స్థానిక నాయకులు నగదు బహుమతులు అందజేశారు.

కేంద్రియ విద్యాలయంలో..

స్థానిక వలసపాకలలోని కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయులు భోగి మంటలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు హరిదాసు వేషంలో వచ్చిన విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు పాటలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శేఖర్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

కాకినాడ సిటీ: స్థానిక 37వ డివిజన్ కచేరిపేట సుందరయ్యభవన్ వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్ బాలల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్‌రేస్, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు పోటీలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బొమ్మల కొలువు, మట్టితో బొమ్మలు తయారు చేయడం, మైండ్ గేమ్స్‌తో చిన్నారులు సంక్రాంతికి స్వాగతం పలికారు. ఈ బొమ్మల కొలువు పోటీలో వంద మంది వరకు బాలబాలికలు తాము తయారు చేసిన బొమ్మలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14న మహిళలకు ముగ్గుల పోటీ, పెద్దలకు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త సీహెచ్ విజయ్ తెలిపారు. యువతీ, యువకులకు పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దివంగత చింతపల్లి అప్పారావు అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో 15వతేదీన బహుమతి ప్రదానం, అనంతరం కూచిపూడి భరతనాట్యంలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన కుమారి వేలురి మహాలక్ష్మి నృత్య ప్రదర్శన జరుగుతాయని విజయ వివరించారు. ఈ కార్యక్రమంలో కె శుభారాణి, డి రత్నం, చింతపల్లి శివకుమార్, శ్రీరమణి, సచివాలయ కార్యదర్శి రేవతి, నీరజ, గౌరీశంకర్, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.


హార్బర్‌పేటలోని ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


వలసపాకలలోని కేంద్రియ విద్యాలయంలో విద్యార్థుల సంక్రాంతి సంబరాలు


తయారు చేసిన బొమ్మలతో పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

బంగారం చీరలో దర్శనమివ్వనున్న బాలాత్రిపురసుందరి

బోట్‌క్లబ్: సంక్రాంతి సందర్భంగా భోగి, సంక్రాంతి, కనుమరోజు స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపురసుందరి అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 14న ఆలయంలో పల్లకిసేవ, సాయంత్రం హరిహరసుతుడు అయ్యప్పస్వామి వారికి లక్ష పుష్పార్చన, అనంతరం జ్యోతి దర్శనం ఉంటుందన్నారు. ఈ నెల 16న కనుమ రోజున ప్రబల ఉత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు


నృత్యరూపక ప్రదర్శనలో పాల్గొన్న నటరాజ నృత్యనికేతన్ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యకళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. నటరాజ కళామందిర్ నాట్యాచారి ఆనెం ప్రసాద్ శిష్యుల ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకొన్నాయి. అనంతరం కళామందిర్ నాట్యాచారి ఆనెం ప్రసాద్‌ను సత్యకళావాహిని సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చౌదరి, శేషగిరిరావు, జ్యోతి, రామకృష్ణారావు, కుంజుక లక్ష్మి, శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాల్లో ప్రగతి చూపండి: ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగనన్న, శాశ్వత భూహక్కు, భూరక్షకు సంబంధించి రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కాకినాడ నుంచి రాజానగరం వరకు నిర్మించ తలపెట్టిన భారతమాల జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. పండగల నేపథ్యంలో ఏవిధమైన కోడిపందేలు, జూద క్రీడలు జరగకుండా పోలీసు వారితో సమన్వయం చేసుకోవాలని అదే విధంగా కొత్త సినిమాల విడుదల నేపథ్యంలో టికెట్లకు ఏ విధమైన బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా థియేటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అదే విధంగా సినిమా థియేటర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ పరిపాలనాధికారి వరహాలయ్య, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కోరిన కోరికలు తీర్చే యండమూరు వేంకటేశ్వర స్వామి

- ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం
- నేడు గోదాదేవి కల్యాణం


యండమూరులోని మీసాల వేంకటేశ్వరస్వామి


సామ్రాజ్యలక్ష్మి


కరపలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

కరప: మండలంలోని యండమూరు గ్రామంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం అతిపురాతనమైంది. వేంకటేశ్వరస్వామితో పాటు సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లు ఉంటారు. ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి మీసాలతో ఆకర్షణీయంగా ఉంటారు. స్వామి వారి, అర్చకుల పేరున పంటభూమి ఉంది. స్వామివారి భూమి దేవదాయశాఖ ఆధీనంలో ఉండి, కార్యక్రమాలు ఆ శాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తుంటారు. ఇది కాక ఆరు కుంచాల పంటభూమి శనగల మాన్యం ఉంది. ఈ భూమి నుంచి వచ్చే ఆదాయంతో స్వామికి శనగలు నైవేద్యంగా సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెడుతుంటారు. ఈ ఆలయంలోని స్వామివార్ల విగ్రహాలు రాముని పాలనలో దొరికినవిగా భక్తుల నమ్మకం. ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రతిరోజు స్వామివారికి, అమ్మవా ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాకార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఏటా మాఘమాసంలో వచ్చే భీష్మ ఏకాదశి రోజున స్వామికి వార్షిక కల్యాణం నిర్వహిస్తారు.

నేడు గోదాదేవి కల్యాణం

ఏటా ధనుర్మాసంలో స్వామికి ప్రతి రోజూ విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఈ గ్రామంలోని స్వామిని ఏడు గ్రామాల స్వామిగా పిలుస్తారు. యండమూరు, నక్కావారి సావరం, పెదకొత్తూరు, చినకొత్తూరు, వై.సావరం, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం ఏడు గ్రామాల స్వామిగా పిలుస్తారు. భోగిరోజున గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో స్వామి, అమ్మవార్లను కల్యాణానికి ముందు ఊరేగిస్తారు. కల్యాణానికి కావల్సిన ఏర్పాట్లు చేసినట్టు దేవదాయశాఖాధికారులు తెలిపారు. ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యాన వేదపండితుల మంత్రోచ్చారణతో, మేళతాళాలతో గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తారు.

కరపలో..

స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం భోగిరోజున గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. విష్ణాలయంలో ఉదయం వేణుగోపాలస్వామికి అభిషేకం, తులసీదళాలతో ప్రత్యేక పూజ, అమ్మవారిని గోదాదేవిగా అలంకరించి, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి కల్యాణం జరుపుతామన్నారు. వివాహం కాని స్త్రీ, పురుషులు గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తే వివాహం జరుగుతుందన్నారు. గోదాదేవి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ వడ్డాది సత్తిబాబు తెలిపారు. గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం పూర్తవుతుందని అనంతాచార్యులు తెలిపారు.

సకాలంలో సరకులు పంపిణీ చేయండి

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకుల పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ ఇలక్కియ పౌరసరఫరాలు, పౌరసరఫరాల కార్పొరేషన్, డిప్యూటీ తహసీల్దార్లు, ఎండీయూ వాహనదారులతో ఇంటింటికి సరుకుల పంపిణీ, సరుకు నిల్వ కేంద్రాలు, ఎండీయూ వాహనాల నిర్వహణ ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా పేద ప్రజలకు అందిస్తున్న బియ్యం ఇతర నిత్యావసర సరుకులు జాప్యం లేకుండా పంపిణీ చేయాలన్నారు. తప్పనిసరిగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు పంపిణీ చేపట్టాలని జేసీ ఇలక్కియ అన్నారు. ఇందుకు డిప్యూటీ తహసీల్దార్లు, క్షేత్రస్థాయిలో పౌరసరఫరాల దుకాణ ప్రతినిధులు, ఎండీయూ వాహనదారులతో సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో డి. చాముండేశ్వరి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి. పుష్పమణి, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దార్లు, ఎండీయూ వాహనదారులు పాల్గొన్నారు.

19న కేసీబీఎస్ సభ్యులకు దంత వైద్య శిబిరం

కాకినాడ సిటీ: ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 19వతేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సంఘం ప్రధాన కార్యాలయంలో డెంటల్ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఈ క్యాంప్ గుంటూరు శ్రీధన్వి డెంటల్ క్లినిక్, కాకినాడ సమీక్ష డెంటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సంస్కృతీసంప్రదాయాల సమాహారం శిల్పారామం

కాకినాడ రూరల్: వాకలపూడి సాగరతీరంలోని శిల్పారామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని చీఫ్ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి 16వ వరకు మూడు రోజులపాటు వివిధ సంస్కృతి, సంప్రదాయాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కాకినాడ శిల్పారామం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి మోహన్ తేజ తెలిపారు. 14వ తేదీ శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి ఏడు గంటల వరకు శృతిలయ సంగీత నాట్యాలయం వారిచే కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. అలాగే 15వ తేదీ ఆదివారం భారతితో కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన, చిన్నారులకు గాలిపటాల పోటీ నిర్వహించనున్నట్టు తెలిపారు. 16వ తేదీ సోమవారం చిరంజీవి వారిచే బుర్రకథ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

జగనన్న ఇళ్ల కాలనీని సందర్శించిన సీపీఎం బృందం

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కాకినాడ నగర వాసులకు కొమరిగిరి ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వ ఆర్థిక సహాయం పెంచి, నాణ్యతగా నిర్మించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కొమరిగిరిలో నిర్మిస్తున్న ఇళ్ల ప్రాంతాన్ని సీపీఎం నాయకులు పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. అయితే కాకినాడ నగరానికి కొమరిగిర ప్రాంతం 10 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఉపాధి కోసం గ్రామాలు వదిలి పెట్టి నగరానికి వచ్చిన పేదలు నివాసం కోసం మరలా గ్రామానికి వెళ్లవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పనపై ఆలోచించాలని సీపీఎం నాయకులు కోరారు.

పంచాయతీరాజ్ వ్యవస్థలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం

కాకినాడ సిటీ: పంచాయతీరాజ్ వ్యవస్థను రాష్ట్రం నుంచి జిల్లా, మండల స్థాయి వరకు అనుసంధానం చేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కలుగు జేసింది. దీనిలో భాగంగా మొట్టమొదటిసారిగా శుక్రవారం కాకినాడ జిల్లా పరిషత్ నుంచి ట్రైల్ రన్‌ను ప్రారంభించారు. జిల్లా పరిషత్‌లో ఈ వీడియో కాన్ఫరెన్స్ కోసం ఓ ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి శుక్రవారం జిల్లాలోని 62 ఎంపీడీవో కార్యాలయాలు, ఆరు డీఎల్‌డీవో, 4 డీపీవో కార్యాలయాలను అనుసంధాన ప్రక్రియను జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ నిర్వహించారు. అదే విధంగా రాష్ట్రం నుంచి ప్రిన్సిపల్ కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, కమిషనర్ కోన శశిధర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఈ వీడియో కాన్ఫరెన్స్ ట్రైల్ రన్‌లో పాల్గొని అధికారులతో సమీక్షించారు.